- ఖండించిన బీఆర్ఎస్ నేతలు
- హన్మకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ ఎదుట పార్టీ శ్రేణుల ధర్నా
- ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

# కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌పై ఆగ్రహం



హన్మకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్‌పై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమైంది. బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. మరోవైపు హన్మకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ ఎదుట హుజూరాబాద్ బీఆర్ఎస్ నాయకులు ధర్నా దిగారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కే ప్రయత్నాలు కాంగ్రెస్ ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కరీంనగర్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

## రేవంత్ నిరంకుశ వైఖరికి నిదర్శనం

**- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



గంగాధర, జూన్ 21: కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం సీఎం రేవంత్ నిరంకుశ వైఖరికి నిదర్శనమని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, పథకాల అమలు గురించి ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమ కేసులతో భయపెట్టలేరని స్పష్టం చేశారు. హైదరాబాద్ శంషాబాద్ విమానాశ్రయంలో హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అక్రమాలను అడుగడుగునా ప్రశ్నిస్తున్నారు కాబట్టే కేటీఆర్, హరీశ్‌రావు, కౌశిక్‌రెడ్డిపై కక్షగట్టి అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్రమంగా అరెస్ట్ చేసిన కౌశిక్‌రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## అక్రమ అరెస్టులు మానుకోవాలి



రాష్ట్రంలో ప్రశ్నించే ప్రజాప్రతినిధులను అరెస్టుల పేరుతో భయభ్రాంతులకు గురిచేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దీనికి నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్. శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్ చేయడం అత్యంత దారుణంగా పరిగణిస్తున్నాం. గతంలోనూ ఆయనపై అనేక కేసులను ప్రభుత్వం పెట్టింది. అన్నింటిలోనూ ఆయన చట్టానికి సహకరిస్తూ వచ్చారు. అలాంటప్పుడు.. ఆకస్మికంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో ప్రభుత్వం ప్రజలకు వివరణ ఇవ్వాలి. ఇటువంటి అరెస్ట్ వల్ల.. బీఆర్ఎస్ శ్రేణుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. అక్రమ అరెస్టుల పేరుతో ఇబ్బందులకు గురిచేయాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా.. బీఆర్ఎస్ శ్రేణులు ఎవరూ భయపడరన్న విషయాన్ని ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తిస్తే మంచిది. ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధులుగా ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపినప్పుడు.. వాటిని బాధ్యతాయుతంగా తీసుకొని పరిష్కరించాలే తప్ప.. విమర్శించే వారి గొంతు నొక్కాలని చూడడం అత్యంత దారుణం. ఇక ముందైనా ఇటువంటి చర్యలకు ప్రభుత్వం చరమగీతం పలుకకపోతే ప్రజలే తగిన బుద్ధిచెపుతారు. అలాగే, బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదన్న విషయాన్ని సైతం ప్రభుత్వం గుర్తిస్తే మంచిది.

**- చల్మెడ లక్ష్మీ నరసింహారావు,**
**బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి**

## కేసులకు భయపడేది లేదు

**- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు**



కరీంనగర్ కార్పొరేషన్, జూన్ 21: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమని, కేసులకు భయపడేది లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, పథకాల అమలుపై ప్రశ్నిస్తున్నందుకు కౌశిక్ రెడ్డిపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు కేసులు నమోదు చేస్తోందన్నారు. బీఆర్ఎస్ క్యాడర్‌లో భయాన్ని సృష్టించడానికి నిర్బంధకాండ కొనసాగిస్తున్నదని దుయ్యబట్టారు. ఎవరేం చేసినా..?, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ భయపడే ప్రసక్తే లేదని, ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిందని, ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇద్దరూ రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై బీఆర్ఎస్ నాయకులపైన తప్పుడు కేసులు పెడుతున్నారని విమర్శించారు. కౌశిక్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రశ్నిస్తే నిర్బంధిస్తారా..?

**- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**



జగిత్యాల, జూన్ 21: 'కాంగ్రెస్ సర్కారు చేస్తున్న అన్యాయాలు, మోసాలపై ప్రశ్నిస్తే నిర్బంధిస్తారా..? ఇది ఎంత మాత్రం సరికాదు. హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని హైదరాబాద్‌లోని విమానాశ్రయంలో అక్రమంగా అరెస్ట్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని' జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత ఒక ప్రకటనలో విమర్శించారు. గత ఏడాదిన్నర కాలంగా కాంగ్రెస్ సర్కార్ ప్రజలకు చేస్తున్న అన్యాయాలపై నిలదీస్తున్న కౌశిక్ రెడ్డిని తప్పుడు కేసులు పెట్టి ఇబ్బంది గురిచేయాలని చూస్తున్నారని విమర్శించారు. ఇలాంటి చిల్లర చేష్టలు, పనికిరాని కేసులు, బీఆర్ఎస్ నేతల సంకల్పాన్ని, మనోధైర్యాన్ని ఎప్పటికీ దెబ్బతీయలేవని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కౌశిక్ రెడ్డిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మెల్యే అరెస్టు అక్రమం

**- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్**

హుజూరాబాద్ టౌన్, జూన్ 21: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు బండ శ్రీనివాస్ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రభుత్వాన్ని నిత్యం ప్రశ్నిస్తున్నారని కౌశిక్‌రెడ్డిపై కక్షపూరితంగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. గత 18 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు, 420 హామీలను మరిచిందన్నారు. పరిపాలన చేతకాక బీర్ఎస్ నాయకులపై కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో ప్రజలంతా చైతన్యవంతులై కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు.

## వానమ్మా.. జాడేదమ్మా..!



వానాకాలం సీజన్‌లో మొదట్లో మురిపించిన వానలు ముఖం చాటేశాయి. నెల రోజుల నుంచి ఒక్క గట్టి వర్షం లేక జిల్లాలో క్రమంగా వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇటు ప్రాజెక్టుల నుంచీ నీరు వచ్చే దారి లేక, సాగుపై ప్రభావం పడే ప్రమాదం కనిపిస్తుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. మరికొద్ది రోజులు ఇలాగే ఉంటే వేసిన పంటలు కూడా చేతికి రావడం గగనమే కానుండగా, వానమ్మ జాడ కోసం ఎదురుచూస్తున్నారు. సుల్తానాబాద్ మండలంలో పత్తి చేలో మొలకలను కాపాడుకునేందుకు రైతులు బిందెలు, బకెట్లతో నీరందిస్తున్నారు. శనివారం మంచరామి గ్రామానికి చెందిన రైతు ఎగుర్ల శ్రీనివాస్ మొలక మొలకకూ డబ్బాతో నీరు పోస్తూ కనిపించడం పరిస్థితికి అద్దంపడుతుండగా, 'నమస్తే' క్లిక్ మనిపించింది.

**- సుల్తానాబాద్ రూరల్, జూన్21**

# కాంగ్రెస్‌లో ప్రచ్ఛన్న యుద్ధం?



- నైరాశ్యంలో హస్తం నాయకులు, కార్యకర్తలు
- మంత్రుల మధ్య పోరు.. నలుగుతున్న నాయకత్వం
- అధినాయకుల ఆదిపత్యపోరుతో ఆందోళనలో కార్యకర్తలు
- మంత్రుల్లో లోపించిన సఖ్యత.. మరుగున పడుతున్న అభివృద్ధి
- అనాథగా మారిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా హస్తం పార్టీ అధినాయకుల మధ్య ప్రచ్ఛన్నయుద్ధం జరుగుతోంది. బయట పడకుండానే.. ఆదిపత్యం కోసం చేస్తున్న ప్రయత్నాలు.. నాయకులకు, సాధారణ కార్యకర్తలకు శాపంగా మారుతున్నాయన్న విమర్శలు ఆ పార్టీలో వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇరువురు మంత్రుల మధ్య పొంతన పొసగక.. జిల్లా శ్రేణులు భారీగా నష్టపోతున్నారన్న చర్చ సాగుతోంది. దీనికి నిలువెత్తు నిదర్శనం.. ఊరించి ఉసూరుమనిపించిన కవ్వంపల్లి సత్యనారాయణ మంత్రి పదవే అన్న చర్చ ప్రస్తుతం పార్టీలో సాగుతుంది. డీసీసీ అధ్యక్షుడిగా పార్టీని నడిపించిన ఆయనకే న్యాయం జరగకపోతే.. ఇక మా సాధారణ నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు ప్రస్తుతం ఉత్పన్నమవుతుండడంతో.. పార్టీ శ్రేణులు పూర్తిగా నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నాయి.**

కరీంనగర్, జూన్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం సాగుతుందా..? పైకి కనిపించకుండానే.. ముఖ్యంగా కరీంనగర్ జిల్లాపై ఆదిపత్యాన్ని చాటుకునేందుకు చాపకింద నీరులా ప్రయత్నాలు సాగుతున్నాయా? ఫలితంగా.. ఎమ్మెల్యే నుంచి సాధారణ నాయకుడి వరకు.. న్యాయం జరగకుండా పోతుందా? ఈ విధానాలు హస్తం పార్టీపై ప్రతికూల ఫలితాలు చూపుతున్నాయా? ఫలితంగా నామినేటెడ్ పదవుల్లోనూ ఆలస్యం జరుగుతుందా..? ఈ వ్యవహారం వల్ల అభివృద్ధి పనులు పడకలేస్తున్నాయా? అంటే.. హస్తం పార్టీ వర్గాలు అవుననే చెబుతున్నాయి. కరీంనగర్ జిల్లాను గుప్పిట్లో పెట్టుకొని పైచేయి సాధించేందుకు.. ఇద్దరు మంత్రులు బయట పడకుండా చాపకింద నీరులా నడుపుతున్న వ్యవహారాలు పార్టీ శ్రేణులకు రోజురోజుకూ ఇబ్బందిగా మారుతున్నాయన్న అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్న ఉద్దేశంతో చాలాకాలంగా పార్టీని అంటిపెట్టుకొని ఉన్న.. చాలా మంది నాయకులు తమకు సముచిత ప్రాధాన్యం దక్కుతుందని ఆశించారు. కానీ, ఒకరి ద్దరికి మినహా.. నేటికీ ముఖ్యంగా కరీంనగర్ జిల్లాలో అందులో జిల్లా కేంద్రంలోని నాయకులకు న్యాయం జరగడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. అంతేకాదు.. నామినేటడ్ పోస్టుల భర్తీకి సంబంధించిన విషయంలోనూ ఒకరు ప్రతిపాదిస్తే.. మరో మంత్రి వాటిని అడ్డుకున్నారన్న విమర్శలు వస్తున్నాయి. గతంలో ఇచ్చిన సుడా చైర్మన్, గ్రంథాలయ చైర్మన్, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వంటి వాటి విషయంలో ఇద్దరు మంత్రుల మధ్య ఉన్న పొరపచ్చాలు బాహాటంగానే బయట పడిన విషయం తెలిసిందే. చివరకు అధినాయకత్వం జోక్యం చేసుకొని.. వాటిని సర్దుబాటు చేసినా.. నేటికీ ఆ పొరపచ్చాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఒక మంత్రి వద్దకు వెళితే.. మరో మంత్రికి ఆగ్రహం వస్తున్న ఉద్దేశంలో చాలా మంది శ్రేణులు అయోమయంలో కొట్టామిట్టాడుతున్నారు. ప్రధానంగా నాయకుల మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం కార్యకర్తలపై ప్రభావం చూపడమే కాదు.. చివరకు మానకొండూర్ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లిపైనా పడిందన్న చర్చ ప్రస్తుతం పార్టీలో సాగుతోంది. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికలకు ముందే బాధ్యతలు తీసుకున్న కవ్వంపల్లి.. నాటి నుంచి నేటి వరకు.. ఆయనే కొనసాగుతున్నా మంత్రి పదవుల విషయంలో సముచిత న్యాయం జరగలేదన్న చర్చ ప్రస్తుతం ఆ పార్టీలో సాగుతోంది. తనకి మంత్రి పదవి ఇస్తున్నట్లుగా.. అన్నీ ఛానళ్లలో స్క్రోలింగ్‌లు వచ్చాయి. పార్టీ శ్రేణులు నియోజకవర్గంలో సంబురాలు జరుపుకున్నారు. చివరకు... కవ్వంపల్లికి కాకుండా.. ఉమ్మడి జిల్లా ధర్మపురికి చెందిన ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఇచ్చారన్న ప్రచారం సాగుతోంది. అంటే.. పదవి ఇస్తామని ఊరించి.. ఉసూరుమనిపించారన్న చర్చ పార్టీ వర్గాల్లో సాగుతుండగా.. ప్రస్తుతం కవ్వంపల్లి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం పార్టీపైనా పడుతుందన్న చర్చ నడుస్తోంది. అయితే, కవ్వంపల్లికి మంత్రి పదవి రాకపోవడానికి ప్రధాన కారణం.. మంత్రుల మధ్య నెలకొన్న ఆదిపత్య పోరే అన్న చర్చ ప్రస్తుతం ఆ పార్టీలో హాట్‌హాట్‌గా సాగుతోంది. ఇదొక్కటే కాదు.. కరీంనగర్ జిల్లా నుంచి చాలా మందికి ఇప్పటికే నామిటేడ్ పదవులు రావాల్సి ఉన్నా.. ప్రతిపాదనలు పంపడంలోనే ఆలస్యం జరుగుతుందన్న చర్చ సాగుతోంది. కొన్ని ప్రతిపాదనలు పంపినా.. వాటిని ఫాలో చేయడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా వాసులు తమ సమస్యలు ఉంటే.. ఏ మంత్రి వద్దకు వెళ్లాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఎవరికి వారే.. నేను కరీంనగర్ జిల్లా మంత్రిని కాదంటూ చెపుతూనే.. ఇదే జిల్లాపై తమదైన ముద్రను వేయడానికి చేస్తున్న ప్రయత్నాలు వర్గ పోరును పెంచడంతోపాటు.. శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నాయన్న చర్చ ప్రస్తుతం ఆ పార్టీలోనే జోరుగా సాగుతున్నది.

### అభివృద్ధికి విఘాతం

గతంలో ఉన్న ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పలు మార్లు ఉమ్మడి జిల్లా మీటింగ్ పెట్టారు. అయినా.. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో నేటికీ పూర్తిస్థాయిలో ఇందిరమ్మ కమిటీలు ఏర్పడలేదంటే.. అభివృద్ధికి ఎటువంటి విఘాతం కలుగుతుందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా.. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా నేటికీ పూర్తి స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించలేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా స్మార్ట్‌సిటీ కింద రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. తద్వారా వాటి ద్వారా చేపట్టిన పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. గతంలో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలో నిత్యం ఇచ్చిన తాగునీరు.. ఇప్పుడు రోజు విడిచి రోజు ఇస్తున్నారు. దీనిపై ఏనాడూ సమీక్ష లేదు. పట్టణ, పల్లె ప్రగతి కింద నిధులు రాకపోవడంతో అభివృద్ధి కుంటు పడిపోతుంది. గతంలో చేసిన పనుల బిల్లులు రాక కాంట్రాక్టర్లు అవస్థలు పడుతున్నారు. రాజీవ్ యువ వికాసం కింద ఉమ్మడి జిల్లా నుంచి వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. వారి పరిస్థితి ఏమిటో ఎవరూ క్లారిటీ ఇవ్వడం లేదు. రేషన్ కార్డులు కొత్తవి ఇస్తున్నా.. కొంత మందికి మూడు నెలల పాటురేషన్ ఆగిపోయింది. మరికొంత మందికి రావడం లేదని ప్రజావాణికి ఫిర్యాదులొస్తున్నాయి. సీఎం అశ్యూరెన్స్ కింద కార్పొరేషన్‌కు దాదాపు రూ.130 కోట్ల వరకు నిధులు రావాల్సి ఉంది. వాటిని పట్టించుకునే వారు లేరు. ఈ ప్రభావం అభివృద్ధి పనులపై స్పష్టంగా కనిపిస్తోంది. స్మార్ట్ సిటీ కింద చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చివరకు.. మున్సిపాలిటీల్లో స్ట్రీట్ లైట్లు కాలిపోతే.. కొత్తవి పెట్టలేని పరిస్థితి నెలకొన్నది. కాలం ముంచుకొస్తున్న తరుణంలో.. ఇంకా డిమాండ్‌కు తగిన యూరియా రాలేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఇలా విభిన్న సమస్యలున్నా.. వీటిపై సమీక్ష పెట్టకపోవడానికి ప్రధాన కారణం మంత్రుల మధ్య ఉన్న ప్రచ్ఛన్న యుద్ధమే కారణమన్న చర్చ ప్రస్తుతం ఆ పార్టీలో నడుస్తోంది. అలాగే.. చుట్టుపక్కల మున్సిపాలిటీలు, గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం కావడంతో.. కొత్త డివిజన్ల ప్రక్రియ చేపట్టారు. వీటిపై వందల్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. నిజానికి ఇలాంటి అంశంపై మంత్రులు ప్రత్యేక చొరవ చూపి దిశానిర్దేశం చేయాల్సి ఉండగా.. తమకెందులే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, అయితే.. కొంత మందికి మాత్రమే సహకరిస్తున్నారని, తద్వారా.. ఇరువర్గాలకు చెందకుండా పార్టీని నమ్ముకొని ముందుకు సాగుతూ.. డివిజన్లపై ఆశలు పెట్టుకున్న నాయకులకు అన్యాయం జరుగుతుందన్న విమర్శలు ప్రస్తుతం ఆ పార్టీ నుంచే వెల్లువెత్తుతున్నాయి. వీటన్నింటికీ కారణం.. మంత్రుల మధ్య ఆదిపత్య పోరే అన్న అభిప్రాయాలు ప్రస్తుతం హస్తం పార్టీలో హాట్‌టాపిక్‌గా మారాయి.

# 'స్థానికం'లో విజయమే లక్ష్యం కావాలి

- కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలను ప్రజలకు వివరించాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్

వెల్గటూర్, జూన్ 21 : స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎండపెల్లి మండలం రాజారంపల్లిలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో శనివారం తన అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశంలో కొప్పుల మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ 420 మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ ఎన్నికల్లో ప్రజల్లో బీఆర్ఎస్ బలమేంటో ప్రతిపక్షాలకు చూపెట్టాలన్నారు. ధర్మపురి ఎమ్మెల్యేగా గెలిస్తే 100 రోజుల్లో ఏదో చేస్తామని ప్రజలను మభ్యపెట్టారని, ఇప్పటికైనా చేసి చూపిస్తే సంతోషిస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి పూర్తిస్థాయిలో కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయ దుందుబి మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. అలాగే, బీఆర్ఎస్‌లో పదవులను అనుభవించి పార్టీని వదిలి వెళ్లిన వారిని ఎట్టిపరిస్థితుల్లో మళ్లీ పార్టీలోకి అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, బీఆర్ఎస్ నాయకులు రమణారావ్, అయ్యోరి రాజేశ్‌కుమార్, రాంచందర్ పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ స్ఫూర్తిగా ముందుకుసాగాలి

- రాష్ట్రం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన గొప్ప వ్యక్తి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మంథని, జూన్ 21: ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తుదిశ్వాస వరకు పోరాడిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని, ఆయన స్ఫూర్తిగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సూచించారు. శనివారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంథనిలో నిర్వహించారు. సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసం జయశంకర్ సార్ సారథ్యంలో తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని గుర్తు చేశారు. పోరాటయోధుడే నాయకుడైతే పరిపాలన ఎలా ఉంటుందో పదేండ్లలో చూపించారన్నారు. జయశంకర్ సార్ ఆశయాలు, లక్ష్యాలతో పరిపాలన అందించారన్నారు. జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్తామని చెప్పారు. ఆయన ఉద్యమాలు, ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఉద్యమకారుడిపై ఉందన్నారు. ఇక్కడ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, కాయితీ సమ్మయ్య, ఎస్‌కే. యాకుబ్, ఆకుల రాజబాబు, వేల్పుల గట్టయ్య పాల్గొన్నారు.



జయశంకర్ సార్ విగ్రహం వద్ద నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

# కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష

- ప్రజలను ఆగంపట్టిస్తున్న రేవంత్ సర్కార్
- దళారీ చేతిలోకి తెలంగాణ
- బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ధ్వజం

అంతర్గాం, జూన్ 21: తెలంగాణకు తొలి సీఎం కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ సర్కారు రాష్ట్ర ప్రజలను ఆగం పట్టిస్తూ.. అబద్ధపు పాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారీచేతిలో పెట్టినట్టు.. పదేళ్లలో అద్భుత రాష్ట్రంగా మారిన తెలంగాణను తిరిగి దళారుల చేతిలోకి వెళ్లిందని ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల సమరంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు గులాబీ సైనికులు సిద్ధంకావాలని పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం తెలంగాణకు కేసీఆర్ పాలన శ్రీరామ రక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం కోరుకంటి మాట్లాడుతూ, అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయడం పక్కన పెట్టి రాష్ట్రాన్ని మళ్లీ ఆగం పట్టిస్తుందని విమర్శించారు. ఇప్పటి దాకా ఆరు గ్యారంటీలను అమలు చేయలేక రోజుకో నాటకం ఆడుతున్నదని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రైతుభరోసాతో ప్రజలను మాయ చేస్తున్నదన్నారు. వచ్చే స్థానిక సమరంలో ప్రజలు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పేందుకు వేచి చూస్తున్నారని, రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కోల సంతోష్‌గౌడ్, నాయకులు కౌశిక హరి, ఆముల నారాయణ, బండారి ప్రవీణ్, కొల్లూరి సత్య, సతీశ్, మెరుగు పోశం, గంగాధరి రాములు, ధరణి రాజేశ్, సతీశ్, మల్లయ్య, అర్శనపల్లి శ్రీనివాస్, నిమ్మరాజుల రవి, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

# సర్కారు బడిని తెరిపించండి

- మంచరామిలో మూతపడిన పాఠశాల
- పిల్లల చదువులకు ఇబ్బందులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

సుల్తానాబాద్‌రూరల్, జూన్ 21: తమ గ్రామంలో మూతపడిన సర్కారు బడిని తిరిగి తెరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పిల్లల చదువులకు ఇబ్బందులు అవుతున్నాయని, అధికారులు వెంటనే స్పందించి పాఠశాలను ప్రారంభించాలని వారు వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మంచరామి గ్రామంలోని ప్రైమరీ పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్నది. దాదాపుగా పదేండ్ల క్రితం వివిధ కారణాలతో సర్కారు బడి మూతపడింది. దీంతో అప్పటి నుంచి గ్రామంలో దాదాపుగా 40మంది విద్యార్థులు సుల్తానాబాద్‌తో పాటు తదితర గ్రామాలకు వెళ్లి ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభసిస్తున్నారు. మంచరామి గ్రామంలో 1,386మంది జనాభా ఉండగా, 494కుటుంబాలు ఉన్నాయి. రికార్డుల ప్రకారం 391గృహాలు ఉన్నాయి. గ్రామం నుంచి ప్రభుత్వ ఉద్యోగాలు (ప్రస్తుతం జిల్లా డీపీవో వీర బుచ్చయ్యతోపాటు ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి, కానిస్టేబుల్‌తో పాటు పలువురు) పొందిన వారు సైతం తిరిగి పాఠశాలను తెరిపించాలని సంబంధిత విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

## పీజీ పరీక్షల ప్రణాళిక విడుదల

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జూన్ 21 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఎంఏ, ఎంఎస్సీ, ఎం.కామ్ పరీక్షల ప్రణాళికను యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేశ్‌కుమార్ శనివారం విడుదల చేశారు. ఈ క్రమంలో నాలుగో సెమిస్టర్ పరీక్షలు జూలై 1 నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ పరీక్షలు కూడా జూలై 1 నుంచి 16, ఎంసీఏ పరీక్షలు జూలై 1 నుంచి 6వ తేదీ వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని, సందేహాలకు ఆయా కళాశాలలో సంప్రదించాలని సూచించారు.